కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మ

- నేటి నుంచి బోయకొండలో దసరా మహోత్సవాలు



బోయకొండ గంగమ్మ



ఆలయ ముఖచిత్రం

బోయకొండ(చౌడేపల్లె): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆలయంలో అక్టోబర్ 4వ తేదీ శుక్రవారం నుంచి 12వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు వైభవంగా శరన్నవ దసరా మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు బోయకొండ ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మగా పేరొందిన బోయకొండ అమ్మవారికి కనులపండువగా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మహోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా ప్రారంభించారు. భక్తులకు రోజూవారీ సేవల వివరాలను తెలియజేయడానికి పోస్టర్లు ముద్రించి జిల్లా వ్యాప్తంగానే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడులో ఏర్పాటుచేశారు. బోయకొండలో నిర్వహించే మహోత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నట్లు చెప్పారు.

ఆలయ చరిత్ర..

జిల్లాలోని పుంగనూరు పట్టణానికి 14కి.మీ దూరంలోని బోయకొండ గంగమ్మ దేవస్థానం ప్రసిద్ధిగాంచిన దేవాలయాల్లో ఒకటిగా వెలసింది. భారతావని నవాబులు పాలించే సమయంలో దక్షిణ భారతంలో కూడా తమ ఆధిపత్యాన్ని నెలకొల్పాలనే ధ్యేయంతో తమ సేనలతో దండయాత్రలు చేస్తున్నారు. అక్కడి జమిందారులను, పాలేగాళ్లను జయించి ఇష్టానుసారంగా పన్నులను వసూలు చేస్తున్న సమయమిది. పుంగనూరు సంస్థాన పరిసర ప్రాంతాలపై నవాబుల కన్నుపడింది. గోల్కొండ నవాబులు సైన్యాలను పుంగనూరు ప్రాంతంపై దండెత్తి గ్రామాల్లో చొరబడి దాడులు చేయడం మొదలుపెట్టారు. పుంగనూరు వైపు వస్తున్న నవాబు పదాతిదళాలు చౌడేపల్లె వద్ద ఉన్న అడవుల్లో నివశించే బోయలు, ఏకిల గూడెంలలో ప్రవేశించి బీభత్సం సృష్టించారు. ఎదుర్కొన్న అనేకమంది బలయ్యారు. నవాబుసేనలు కూడా హతమయ్యాయి. తగ్గిన సేనలు వెనుదిరిగాయి. మరలా గోల్కొండ నుంచి సేన పుంగనూరుకు చేరింది. ఈ విషయం తెలుసుకున్న బోయలు, ఏకిల దొరలు భయంతో కొండగుట్టకు వెళ్లి తలదాచుకొని జగజ్జననిని ప్రార్థించారు. వీరిమొర ఆలకించి శక్తి స్వరూపిణి అవ్వరూపంలో వచ్చి బోయలకు ధైర్యం చెప్పిందని ప్రతీతి. నవాబుసేనలను అవ్వరూపంలో ఉన్న శక్తి స్వరూపిణి తన ఖడ్గంతో హతమార్చడం ప్రారంభించింది. నవాబు సేనలను హతమార్చిన అమ్మవారిని శాంతింపచేయడానికి ఒక మేకపోతును బలి ఇచ్చి తమతో ఉండమని ప్రార్థించారు. వారి కోరిక మేరకు వెలసిన అమ్మవారిని దొర బోయకొండ గంగమ్మగా పిలువడం పరిపాటి అయింది.

పవిత్రమైన పుష్కరిణి తీర్థం

అమ్మవారి ఆలయం సమీపంలోని పుష్కరిణిలోని నీరు అతి పవిత్రమైన తీర్థంగా భావిస్తారు. ఈ తీర్థాన్ని సేవించడం వలన సకల రోగాలు మటుమాయం అవుతాయని భక్తుల విశ్వాసం.



విద్యుద్దీపాలతో ఆర్చి ముస్తాబు

అమ్మవారి పుష్పం మహిమ..


భక్తులు తమ కోరికలు నేరవేరుతాయా లేదా అని తెలుసుకునేందుకు అమ్మవారి శిరస్సుపై మూడు పుష్పాలు ఉంచి కోరికలను మనస్సులో స్మరించమంటారు. అమ్మవారు కుడివైపున పుష్పం పడితే కోరికలు తీరుతాయని, ఎడమవైపు పడితే ఆలశ్యంగా నెరవేరుతుందని, మధ్యలో పడితే తటస్థంగా భావిస్తూ అమ్మవారి మాటగా కొనసాగిస్తున్నారు. 4వ తేదీ నుంచి వివిధ రూపాల్లో అమ్మవారు దర్శనమివ్వనున్నారు.

రవాణా మార్గాలు.....

చౌడేపల్లె నుంచి బోయకొండ ఆలయం 12 కిమీ దూరం. ఈమార్గంలో ఆర్టీసీ బస్సుసౌకర్యం కలదు. అలాగే పుంగనూరు నుంచి బోయకొండకు 14 కి.మీ దూరం. అలాగే మదనపల్లె నుంచి బోయకొండకు 16 కి.మీ దూరం. కొండ కింద నుంచి ఆలయం వరకు ప్రైవేట్ వాహనాల ద్వారా ప్రయాణం చేయడానికి అధికారులు సౌకర్యం కల్పించారు.

భక్తుల కోసం ప్రత్యేక సౌకర్యాలు..

దసరా మహోత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చే యాత్రికులకు అవసరమైన సదుపాయాలు, దర్శన సౌకర్యాలపై ప్రత్యేకంగా చర్యలు తీసుకోనున్నట్లు ఆలయ ఈఓ ఏకాంబరం చెప్పారు. రోజుకొక అలంకారం చొప్పున బోయకొండపై తొమ్మిది ఆర్చిలను సైతం ఏర్పాటు చేయనున్నారు.దసరా మహోత్సవాల్లో పాల్గొన దలచిన ఉభయదారులు రూ.5,116 చెల్లించాలన్నారు. అలాగే దుర్గా సప్తశతి చండీ హోమం (పౌర్ణమిరోజున) పాల్గొనే ఉభయదారులు రూ.2,116 చెల్లించి పాల్గొనవచ్చునని తెలిపారు. శీఘ్రఫలదాయిని పూజలో పాల్గొనే భక్తులు రూ.516 చెల్లించాలన్నారు. ప్రతి ఆదివారం, మంగళవారం మాత్రమే నిర్వహిస్తారని ఈఓ పేర్కొన్నారు.



జిల్లా జట్టుకు చౌడేపల్లె విద్యార్థి



నిరంజన్

చౌడేపల్లె: ఎస్‌జీఎఫ్ అండర్–17 వాలీబాల్ జిల్లా జట్టుకు చౌడేపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థి నిరంజన్ ఎంపికైనట్లు హెచ్‌ఎం నాగరాజరెడ్డి గురువారం తెలిపారు. గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపిన నిరంజన్‌ను జిల్లా జట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. త్వరలో శ్రీసత్యసాయి జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో నిరంజన్ జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. నిరంజన్‌ను హెచ్‌ఎం, వ్యాయామోపాధ్యాయుడు రాజేంద్ర,ఉపాధ్యాయులు అభినందించారు.

క్లుప్తంగా

రసాయనిక ఎరువులు తగ్గించండి



కొండామర్రిలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ

చౌడేపల్లె: రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని ఏఓ జ్యోతమ్మ సూచించారు. గురువారం కొండామర్రి, చౌడేపల్లె రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు సాగుచేసిన వేరుశనగ, వరి పంటలను పరిశీలించి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వీఏఏ నవీన్, అర్షద్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



అవగాహన కల్పిస్తున్న సావిత్రమ్మ

బైరెడ్డిపల్లె: ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ అన్నారు. బైరెడ్డిపల్లెలో గురువారం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నతనంలోనే వివాహాలు జరిపిస్తుండడం వలన అనర్థాలు జరుగుతున్నాయన్నారు. బాల్య వివాహాల వలన మాతాశిశు మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు.

5,6 తేదీల్లో బస్ పాసులు ఇవ్వరు

పలమనేరు: పలమనేరు ఆర్టీసీ బస్టాండులోని బస్‌పాస్ కౌంటర్‌లో ఈనెల 5, 6 తేదీల్లో బస్ పాస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కారణంగా ఎలాంటి సేవలు అందుబాటులో ఉండవని ఆర్టీసీ డీఎం టీకే స్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆపై యథావిధిగా సేవలు అందుబాటులో ఉంటాయని, విద్యార్థులు సహకరించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు రక్షిత ఎంపిక



పుంగనూరు: శ్రీనగర్‌లో ఈనెల 18 నుంచి జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు మన రాష్ట్రం తరపున రక్షిత 8వ తరగతి విద్యార్థి ఎంపికైంది. చంద్రమాకులపల్లె గ్రామ నివాసి కొండారెడ్డి, అనురాధ కుమార్తె రక్షిత గత నెల వినుకొండలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి అండర్–17లో ఉత్తమ క్రీడాకారిణిగా ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు విద్యార్థినిని పీడీ మురళీధర్, ఉపాధ్యాయులు జ్యోతి, రమణారెడ్డి, శైలజ, మంజునాథ్, శంకర్‌రెడ్డి, రఘు, సుజాత, కమిటీ సభ్యులు నారాయణ, రమణ, మంగ అభినందించారు.

క్రీడాకారులు ఏకం కావాలి

కుప్పం: పట్టణంలోని ఎన్‌టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి చేసుకునేందుకు నియోజకవర్గంలోని క్రీడాకారులు ఏకం కావాలని కుప్పం స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డెవలప్‌మెంట్ సభ్యులు కోరారు. గురువారం ఎన్‌టీఆర్ స్టేడియాన్ని వారు పరిశీలించారు. శనివారం నియోజకవర్గంలోని క్రీడాకారుల సమావేశం నిర్వహిస్తామని ప్రతిఒక్కరూ తప్పక హాజరుకావాలని వారు కోరారు. లాయర్ శ్రీకాంత్, బాబు, నరేష్, రవి, రామ్‌రాజ్, అప్పు పాల్గొన్నారు.

బేత్రాయ కొండకు ప్రత్యేక బస్సులు

కుప్పం: పెరటాసి నెల మూడవ శనివారం సందర్భంగా మండల పరిధిలోని బేత్రాయ కొండపై వెలసిన వేంకటేశ్వర దేవస్థానానికి వెళ్లేందుకు భక్తులకు కుప్పం నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ స్వామి తెలిపారు. కుప్పం నుంచి వెండగంపల్లి, బిరుదనపల్లి, నడుమూరు మీదుగా రెండు సర్వీసులు, దళవాయి కొత్తపల్లి మీదుగా రెండు సర్వీసులు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. దీంతో పాటు మల్లానూరు, మెట్లచేను, పైపాళ్యం గ్రామాల నుంచి బేత్రాయ స్వామి కొండకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోస్టల్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పలమనేరు: పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద అక్కడ పనిచేసే ఉద్యోగులు గురువారం నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ఆల్ ఇండియా గ్రామీణ్ డాక్ సేవక్ యూనియన్ ఆదేశాలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు మోహన్‌రాజారెడ్డి మాట్లాడుతూ టార్గెట్ల పేరిట ఉన్నతాధికారులు వేధింపులు ఆపాలన్నారు. సంఘ కార్యదర్శి అరుణ, నేతలు తేజ, అస్లాంఖాన్ పాల్గొన్నారు.

ఎటువంటి సమస్యలున్నా పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



రొంపిచెర్ల: మాట్లాడుతున్న ఎంపీడీఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం వి.కోట గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన గ్రామసభకు హాజరయ్యారు. సర్పంచ్ పీఎస్.లక్ష్మి, ఈఓ శివకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో జెడ్పీ చైర్మన్ ఉపాధి పథకం, ఆరోగ్యశాఖపై మాట్లాడారు. ఈసందర్భంగా వి.కోట మార్కెట్ యార్డు, కేజీఎఫ్ మెయిన్ రోడ్డులో వర్షపు నీరు నిలుస్తోందని ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆయన 10 రోజుల్లోపు జెడ్పీ నిధులతో అక్కడ సీసీ రోడ్డు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పంచాయతీకి సంబంధించి డంపింగ్ యార్డ్‌కు స్థలం ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి స్థలాన్ని ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. అంతేకాక మండలంలో ఏ గ్రామంలో అయినా తాగు నీటి సమస్య ఉన్నట్లయితే తమ దృష్టికి తెస్తే వెంటనే నూతన బోరు మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. వైస్ సర్పంచ్ అక్మల్, వార్డు మెంబర్లు కుమార్‌రాజా, మోహన్, హారతి, నేతలు రామచంద్రుడు, శశికళ, సుబ్బన్న పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

రొంపిచెర్ల: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారి అన్నారు రొంపిచెర్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఏపీఓ బాలమురళి, ఏపీఎం హరినాథ్, సర్పంచ్ ఇబ్రహీంఖాన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సదుం: గ్రామసభల్లో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని సర్పంచ్‌లు ఉషారాణి, అనితా కుమారి తెలిపారు. సదుం, జోగివారిపల్లె పంచాయతీ కార్యాలయాల్లో శనివారం గ్రామసభలు జరిగాయి. ఏపీడీ శ్రీనివాసులు, ఈఓ హసీనా, ఉపసర్పంచ్ బాబురెడ్డి పాల్గొన్నారు.

7న మాన్యం భూముల వేలం

చౌడేపల్లె: గోసలకురప్పల్లె సమీపంలోని కాశీవిశ్వేశ్వరస్వామి మాన్యం భూముల్లో పంటసాగు చేసుకునేందుకు ఈనెల 7వ తేదీ సోమవారం ఆలయం వద్ద ఉదయం 10 గంటకు వేలం పాటను నిర్వహిస్తున్నట్లు ఈఓ కమలాకర్ గురువారం తెలిపారు. ఐదు ప్రదేశాల్లోగల 18.20 ఎకరాల పొలాన్ని మూడేళ్ల పాటు సాగుచేసుకునేందుకు లీజుకు ఇవ్వనున్నామని చెప్పారు. వేలంలో పాల్గొనేవారు రూ. వెయ్యి ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

సర్పంచ్ కుమారుడు తన్వీర్ మృతి

- ఫోన్‌లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి పరామర్శ



తన్వీర్(ఫైల్)

చౌడేపల్లె: మండలంలోని కాగతి సర్పంచ్ షేక్ షంషీర్ కుమారుడు షేక్ తన్వీర్(03) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. జ్వరంలో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొంది వారం క్రితం ఇంటికి వచ్చారు. ఒక్కసారిగా దగ్గు తీవ్రం కావడంతో ఊపిరాడక చిన్నారి మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. విషయం తెలిసి బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించి ఓదార్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పెద్దూరు చేరుకొని చిన్నారికి నివాళులర్పించారు. పలువురు నేతలు పెద్దూరుకు చేరుకొని అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



మంగళంపేటలో వరిని పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరు(పులిచెర్ల): ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసులు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం మండలంలోని గడ్డంవారిపల్లె, మంగళంపేట పంచాయతీల్లో నిర్వహించారు. ప్రతిఒక్క రైతు తమ పంటలకు ఈకేవైసీ చేసుకోవాలన్నారు. అనంతరం సాగులో ఉన్న వరి, వేరుశనగ పంటలను పరిశీలించారు. అఖిల, విజయ, గణేష్ పాల్గొన్నారు.

డ్రోన్లతో పారిశుధ్య పనుల గుర్తింపు



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

కుప్పం: మున్సిపల్ పరిధిలో డ్రోన్ కెమెరాల ద్వారా పారిశుధ్య పనులు గుర్తిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో రోడ్డుపై చెత్తచెదారం వేస్తున్నా, వీధుల్లో పేరుకుపోయినా చెత్తచెదారం గుర్తించేందుకు ఈ డ్రోన్ కెమెరాలు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీకి సంబంధించిన వాహనాలు ఇళ్ల దగ్గరకు వచ్చినప్పుడు మాత్రమే చెత్తచెదారం వేయాలని సూచించారు. ఇష్టానుసారంగా రోడ్డుపై చెత్తచేదారం వేసిన వారిని డ్రోన్ ద్వారా గుర్తించి వారిపై చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని ఆయన సూచించారు. కౌన్సిలర్లు సోమశేఖర్, సురేష్, వేలు, దాము, జాకీర్ పాల్గొన్నారు.

అశ్వియ ఆత్మకు శాంతి చేకూరాలి



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పుంగనూరు: హత్యకు గురైన చిన్నారి అశ్వియ అంజుమ్(7) ఆత్మకు శాంతిచేకూరాలని, హంతకులను శిక్షించాలని కోరుతూ గురువారం సాయంత్రం ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని అంజుమన్ షాదీమహల్‌లో పట్టణ అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో ముస్లింలు హాజరై ప్రార్థనలు నిర్వహించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. అలాగే చిన్నారి కేసులో నిందితులను పోలీసులు త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు.

ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు






బైరెడ్డిపల్లె: అలంకరణలో సల్లాపురెమ్మ, రామకుప్పం: పసుపు అలంకరణలో వాసవీ, వి.కోట: లక్ష్మీదేవిగా దుర్గామాత, పెద్దపంజాణి: బాలాత్రిపురసుందరి దేవి




పట్టువస్త్రాలతో ఆలయ కమిటీ చైర్మన్, గంగవరం: లలితాత్రిపురసుందరి అలంకరణలో..



పలమనేరు: బాలాత్రిపురసందరిగా దుర్గమ్మ

బైరెడ్డిపల్లె: దసరా ఉత్సవాల్లో భాగంగా ఎస్సీ కాలనీలో వెలసిన సల్లాపురెమ్మ ఆలయంలో అమ్మవారికి స్వర్ణకవచం అలంకరణ చేసి భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే తీర్థం శ్రీ రామచంద్రస్వామి ఆలయంలో ధ్వజారోహణం, కలశస్థాపన, మంటపోత్సవాలు నిర్వహించారు.

పసుపు అలంకరణలో వాసవీమాత

రామకుప్పం: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం వాసవీ అమ్మవారు పసుపు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రామకుప్పం, ఆనిగానూరు కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో భక్తులు కిటకిటలాడారు.

వి.కోటలో..

వి.కోట: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దుర్గానగర్‌లోని దుర్గామాత ఆలయంలో వెలసిన దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం మొదటి రోజు దుర్గామాత మహాలక్ష్మిదేవిగా (బాలాత్రిపుర సుందరి) అవతారంలో భక్తులకు దర్శమిచ్చారు. అమ్మవారికి ఆలయ కమిటీ చైర్మన్ దామోదరం పట్టువస్త్రాలు సమర్పించారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో

పట్టణంలోని కేపీ వీధిలో వెలసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శన ఇచ్చారు.

బాలాత్రిపురసుందరి దేవిగా కాళికా దేవి

పెద్దపంజాణి: శివాడి గ్రామంలో వెలసిన కాళికాదేవి బాలాత్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మలాలమ్మ ఆలయంలో..

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద వెలసిన శ్రీ మలాలమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లలితాత్రిపుర సుందరి అలంకరణలో మలాలమ్మ భక్తులకు దర్శనమిచ్చారు.

బాలాత్రిపురసుందరిదేవి అలంకారంలో..

పలమనేరు: దసరా ఉత్సవాలో భాగంగా తొలిరోజైన గురువారం దుర్గాదేవి బాలాత్రిపురసుందరి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ సమీపంలోని టెర్రకోట కాలనీలో వెలసిన అమ్మవారి ఆలయం, పాతపేటలోని కనకదుర్గ ఆలయం, బసవన్నకట్ట ఆలయాల వద్ద తొలిరోజు అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిరు వ్యాపారుల కడుపు కొట్టారు

- తోపుడుబండ్లు తొలగించిన అధికారులు
- న్యాయం చేయాలని బాధితుల ఆవేదన



అధికారులు తొలగిస్తున్న తోపుడు బండ్ల దుకాణాలు (ఫైల్)

కుప్పం: పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారస్తులపై అధికారులు ట్రాఫిక్ జులుం ప్రదర్శించారు. తోపుడు బండ్లు, రోడ్డుపై దుకాణాలు ఖాళీ చేయించడంలో అధికారులు తమ ప్రతాపం చూపించారు. ప్రస్తుతం కడా ప్రాజెక్టు, తహసీల్దార్ కార్యాలయం ఎదుట స్థలం ఖాళీగా ఉంది. ఇక్కడ ఉన్న చిల్లర వ్యాపారస్తులను గెంటివేత చర్యలకు పూనుకోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వివరాలు..

20 ఏళ్లుగా పట్టణంలో రైల్వేస్టేషన్ సర్కిల్ వద్ద మరమరాలు, అరటిపండ్లు, చిల్లర వ్యాపారాలు తోపుడు బండ్లపై నిర్వహించేవారు. 15 రోజులు క్రితం ట్రాఫిక్‌కు ఇబ్బంది, కార్యాలయాలకు పార్కింగ్ స్థలం కోసం దుకాణాలను ఖాళీ చేయించారు. దీంతో చిరు వ్యాపారస్తులు జీవనాధారం కోల్పోయారు. మున్సిపల్ కార్యాలయ అధికారులకు తమ గోడు నివేదించినా అరణ్యరోదనే అయ్యింది. అధికారులు తమ కడుపు కొట్టారని మహిళా వ్యాపారస్తులు కన్నీరుమున్నీరయ్యారు. వాస్తవానికి పట్టణంలో ఏ చిన్న వ్యాపారమైనా జరిగేది నేతాజీ రోడ్డుపైనే. మరెక్కడ వ్యాపారాలు చేసినా పెద్దగా ఉండదని, అలాంటి తమకు దుకాణాలు తొలగించి కుటుంబాలను రోడ్డున పడేశారని బాధితులు ఆక్రోశిస్తున్నారు.



ఈమె పేరు ధనలక్ష్మి. స్థానిక ఎన్‌టీఆర్ కాలనీలో ఉంటోంది. 20 ఏళ్లుగా రైల్వేగేటు సర్కిల్‌లో తోపుడు బండిపై ముగ్గుపొడి, రంగులు, ఎర్రమన్ను.. మొదలైనవి విక్రయిస్తూ కుటుంబాన్ని ఇబ్బందుల నడుమ పోషిస్తోంది. మరోవైపు ఆమె భర్త మోహన్ పక్షవాతం బారిన పడి మంచానికే పరిమితమయ్యాడు. 15 రోజులు క్రితం దుకాణాలు రోడ్డుపై నుంచి తొలగించడంతో బతుకుదెరువు కోల్పోయింది. భర్త మోహన్‌కు కావాల్సిన మందులు కొనలేక, కుటుంబాన్ని పోషించే మార్గం లేక సతమతమవుతోంది. తోపుడుబండిని రైల్వేగేట్ సర్కిల్‌లో పెట్టనీయకపోవడంతో చివరకు ఆర్‌అండ్‌బీ శాఖ కార్యాలయం వద్దకు మార్చింది. అయితే మధ్యాహ్నం 12 గంటలైనా ఒక్క రూపాయి కూడా బోణీ కూడా కాలేదని తన గోడు వెళ్లగక్కింది.